
# ఫ్లాష్ బ్యాక్



పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి  అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం

## టాకీ రజితోత్సవం

### టాకీ పుట్టుక

### అర్దేశర్ ఇరాని

### (1957 ఫిబ్రవరి, చిత్రసీమ పత్రిక నుంచి)

1931వ సంవత్సరంలో 'ఆలంఆరా' అనే మొట్టమొదటి టాకీ చిత్రాన్ని నేను నిర్మించటానికి ప్రయత్నిస్తున్న సమయంలో ఫిలిం ఫీల్డులోని నా మిత్రులు ఇతర శ్రేయోభిలాషులు నన్ను దాదాపు 'పిచ్చి' వాడి క్రింద జమకట్టారు. భారతీయ మూవీ చిత్రాలకు శబ్దాన్ని కూడా జోడించాలని ప్రయత్నించిన 'నేరాని'కిగాను. నిజానికి ఆ రోజులు చాలా 'పిచ్చి'గానే ఉండేవి. దీనికిగాను ఎవరినీ నిందించి ప్రయోజనం లేదు. ఆర్థిక దృష్ట్యా చూస్తే టాకీలు లాభదాయకం కావని ఆ రోజుల్లో భావించేవారు. కాలం దొర్లిపోయింది. క్రమేణా భారత జాతికి టాకీలు వినోదానికి అత్యుత్తమ సాధనంగా పరిణమిల్లి, మద్రాసు, బొంబాయి, కలకత్తాలలోని నా మిత్రులంతా పరిశ్రమలో ముందడుగు వేస్తూ, విదేశ చిత్ర ప్రదర్శనకు అవకాశం కూడా లేకుండా చేశారు.

'టాకీ' చిత్రాన్ని ప్రవేశపెట్టిన తర్వాత నేను మరొక పరిశోధన గావించాను. భారత ఫిలిం పరిశ్రమలో వర్ణ చిత్రాన్ని ప్రవేశపెట్టాలనే అభిప్రాయం కలిగింది. నా సహచరుల సహకారంతో 'కిసాన్ కన్య' అనే వర్ణ చిత్రాన్ని తీయటంలో సఫలీకృతుడనైనాను.

ప్రప్రథమ టాకీ చిత్రాన్ని తీసినందుకుగాను నన్నెవరూ తారాపథానికి ఎత్తనవసరంలేదు. ఎందుకంటే దేశానికి, యీ పరిశ్రమకు నాకు చేతనైన సాయం చేశాను. అసలు యీ పరిశ్రమలో నేను చిన్న స్థానాన్నుంచే వచ్చాను. మొట్టమొదటగా నేను విదేశీ చిత్రాల డిస్ట్రిబ్యూటర్‌గా ఉండేవాడిని, తర్వాత అబ్దుల్లాలి యుసఫల్లీ అనే ఆయనతో కలిసి, బొంబాయిలో ఆ రోజుల్లోనే అధునాతనమైన అలెగ్జాండ్రా సినిమాను తీసుకున్నాము. ఎగ్జిబిటర్‌గా యిట్లా కాలం గడుస్తూండగా, ఫిలిం ప్రొడక్షన్‌లోకి దిగాలనిపించింది. ప్రప్రథమంగా నేను తీసిన సైలెంట్ చిత్రం 'వీరాభిమన్య'. ఈ చిత్రం స్టార్ ఫిలింస్ సంస్థ పేరున తీయబడింది. ఆ తర్వాత కొన్ని పౌరాణికాలు తీసి, మెజస్టిక్ ఫిలిం కంపెనీ స్థాపించిన అనంతరం అంటే 1926 సంవత్సరంలో అబ్దుల్లాలీ యూసఫల్లి, మహ్మదాలీ రాంగ్‌వాలాలతో కలసి, ఇంపీరియల్ ఫిలిం కంపెనీని స్థాపించాము. తర్వాతనే గిర్గాంలోని మెజస్టిక్ సినిమాను కూడా మేము స్వాధీనం చేసుకున్నాం.

ఫిలిం పరిశ్రమలోని తొలిరోజుల్లో అందరూ అన్నీ కూలంకషంగా నేర్చుకోటానికి, ఇంపీరియల్ ఫిలిం స్టూడియో చక్కని అవకాశాన్ని కలిగించింది. అంతేగాక ఆ రోజుల్లో ఫిలిం కంపెనీలలో అది అగ్రశ్రేణికి చెందింది కూడా, ఫిలిం పరిశ్రమలో కృషిచేయటమంటే మా అందరికీ ఎంతో ఉత్సాహంగా ఉండేది. నిజానికి, నేను మొట్టమొదట టాకీని నిర్మించాలనే తలంపు కలగటానికి 'షోబోట్' అనే యింగ్లీషు చిత్ర ప్రభావమే. ఉద్దేశ్యమైతే కలిగింది గాని ఇండియాలో అలాంటి ప్రయత్నం అసంభవమేమోననిపించింది. ఎందుచేతనంటే మనకు, దానికి తగిన పరికరాలుగాని, సదుపాయాలుగాని లేవు. అయినా మనం కూడా టాకీ చిత్రాన్ని నిర్మించాలనే భావన బలవత్తరంగా ఉండటం వల్ల కార్యదీక్షతో ముందుకు సాగాను, దాని ఫలితమే 'ఆలంఆరా.'

టాకీలు పుట్టిన తొలిరోజుల్లో పరికరాల సమస్య చాలా పెద్దదిగా ఉండేది. 'పోర్టబుల్ మెషిన్' ఆటవస్తువు వలె ఉండేది. అవుట్ డోరుకు, దీనిని కారులో పెట్టుకుని తీసుకు వెళ్ళేవాళ్ళం. మొట్టమొదట టాకీ చిత్రాన్ని నిర్మించేటప్పుడు, ఫలానా నియమాలు పాటించాలనే సూత్రాలేమీ మాకు లేవు. ప్రతిదానిని మేము నిర్ణయించుకోవాలి. పాటలు, మాటలు వ్రాసేవారు లేరు, సంగీత దర్శకులు లేరు, అన్నీ మేమే సరి చూసుకోవాలి. టెక్నికల్‌గా చూసినా మేము 'సింగిల్ సిస్టం' నే అనుసరించాల్సి వచ్చేది. దీనితో అనేక బాధలు పడ్డాం. 'సింగిల్ సిస్టం'లో కెమెరా ఒక చివరన సౌండ్ ట్రాక్ ఎక్స్‌పోజు కాబడేది. ముందు భాగాన బొమ్మలు పడేది. కాబట్టి ఈ రోజుల్లో ఉన్న డబుల్ సిస్టంతో పోల్చిచూస్తే, ఆనాటి 'సింగిల్ సిస్టం' చాలా కష్టమైనది. ఈనాటి డబుల్ సిస్టంలో సౌండ్ నెగటివ్, పిక్చర్ నెగిటివ్‌లు వేర్వేరుగా ఉన్నాయి. చివరికి పాజిటివ్ ప్రింటింగ్‌కు యీ రెంటినీ ఉపయోగించవచ్చు.

బ్యాక్ ప్రొజెక్షన్, డబ్బింగ్, ట్రాలీ షాట్స్, ప్లే బాక్ గాత్రాలు మొదలైన సాంకేతిక సదుపాయాలు కూడా ఆ రోజుల్లో లేవు. ఎడిటింగ్‌కు కూడా మేము చాలా అవస్థ పడాల్సి వచ్చేది. ఎందుచేతనంటే ఆ రోజుల్లో, యీనాటి 'మువియోలా'

కూడా లేదు. ఇవన్నీ లేవే అని బాధ మాకు అప్పుడు లేదు. ఉత్సాహంతో ఉరకలు వేస్తూ కార్యోన్ముఖులమయేవారం. మా నిర్ణీతమైన కార్యక్రమానికి ఎప్పుడూ భంగం వాటిల్లేది కాదు.

డెమ్మింగ్ అనే విదేశీయ నిపుణుడు మెషిన్‌ను బిగించటానికి, అది ఎట్లా పనిచేస్తుందో మాకు నేర్పటానికి బొంబాయి వచ్చాడు. ఆయన ఖర్చులు రోజుకు నూరు రూపాయలు అయేవి. ఆ రోజుల్లో అది చాలా పెద్ద మొత్తం. దీనిని మేం భరించలేకపోయాం. స్వర్గీయ రుస్తుంబరూచాతోపాటు నేను నెలరోజుల్లోనే రికార్డింగ్ నేర్చుకుని, 'ఆలంఆరా' చిత్రానికి ఏ నిపుణుని సహాయం లేకుండానే రికార్డు చేశాను. ఈ విధంగా 'ఆలంఆర' చిత్రానికి నిర్మాత దర్శకుల బాధ్యతలనేగాక, ఫోటోగ్రఫీ, రికార్డింగ్ మొదలైన సాంకేతిక శాఖల బాధ్యతలనుకూడా నేను వహించవలసి వచ్చింది.

'ఆలంఆరా' కథ అందరికీ తెలిసింది, స్టేజిమీద మంచి ప్రచారంలోనే ఉంది కూడా. అందుచేతనే దీనిని ఎన్నుకున్నాం. స్క్రిప్టు, డైలాగులు, పాటలు అన్నీ జోసఫ్ డేవిడ్‌చే తెరకు తగినట్లుగా మార్చబడినవి. తారాగణంలో జుబేదా, మాస్టర్ విఠల్, ఎలిజర్, పృధ్వీరాజ్, జగదీశ్ సేతి, జిల్లోభాయ్, డబ్ల్యు, ఎం.ఖాన్, మోడి ఉన్నారు. అన్నిటికన్నా ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే 'ఆలంఆరా' చిత్రానికి ఆర్కెస్ట్రా లేదు. మ్యూజిక్ డైరెక్టరూ లేదూ. నేనూ, నా సహచరులూ కలిసి ట్యూన్‌లు కట్టి, రిహార్సల్స్ జరిపేవారం. హార్మోనియం తబలాలనే వాడాం. అప్పుడప్పుడు ఫిడేలునాదం మాత్రం వినిపించేది. అయినా కూడా ఆ చిత్రంలోని కొన్ని పాటలు 'హిట్స్' అయినాయి. ముఖ్యంగా ఫకీర్‌గా ఖాన్ పాడిన 'దేదె ఖుదా కె నాంసే' అనే పాట ఆ రోజుల్లో ఎవరి నోట విన్నా వినిపిస్తూండేది.

ప్లేబ్యాక్ పద్ధతి ప్రచారంలో లేని ఆరోజుల్లో పాటలు కూడా ఒకేసారి డైరెక్ట్ టేక్స్‌లోనే తీయవలసి వచ్చేవి. పాటల చిత్రీకరణకు అంతకుముందు ఉదాహరణలేమీలేని ఆ రోజుల్లో, దీనివల్ల ఆర్టిస్టులుగాని, డైరెక్టరుగాని ఎంత యాతనపడాల్సి వచ్చేదో ఊహించుకుంటే తెలుస్తుంది. వీటన్నిటికన్నా చిక్కు సమస్య 'మైక్'. కెమేరాలో యిది కనిపించకుండా ఒకరు పట్టుకునేవారు. ఔట్‌డోర్‌లలో అయితే యింకా ఏవేవో 'ట్రిక్'లు చేయాల్సివచ్చేది.

ఒక సీనులో హీరోయిన్ చెట్టుమీద పడుకుని పాడుతుంటుంది. ఆ సీనులో ఒక్క మైక్రోఫోన్‌ను మాత్రమే కనపడకుండా చేయగలం. రెండోదానికి అవకాశం లేకపోయింది. ఆరోజుల్లో 'బూమ్' యింకా ప్రచారంలోకి రాలేదు కాబట్టి ఎన్నో కష్టాలు పడాల్సి వచ్చేది.

ఆ రోజుల్లో షూటింగ్ రిఫ్లక్టర్ల సహాయంతో ఎక్కువగా ఔట్ డోర్స్‌లోనే జరిగేది. 'ఆలంఆరా' చిత్రాన్ని స్టూడియోలో అరడజన్ లైట్లతో షూటింగ్ జరపటం మాకొక నూతనానుభవం. అందరూ ఆశ్చర్యపడ్డారు కూడా. సౌండ్‌ట్రాక్‌లో బయట గొడవలు వినిపించకుండా ఉండటానికిగాను ఎక్కువగా రాత్రివేళల్లోనే షూటింగ్ జరిపేవారం.

ఈ విధంగా విదేశ నిపుణుల సహాయంగాని, సలహాలుగాని లేకుండా మొట్టమొదటి టాకీ 'ఆలంఆరా'ను నాలుగు నెలల్లో ముగించాం. ఆ చిత్రం నిడివి 10,500 అడుగులు మా నిర్మాణ ఖర్చులతో పోల్చిచూస్తే చాలా తక్కువే.

1931 వ సంవత్సరం మార్చి 14 వతేదీన బొంబాయి మెజస్టిక్ సినిమాలో 'ఆలంఆరా' చిత్రం విడుదలైనప్పుడు ప్రజలు ఆందందోత్సాహాలతో స్వాగతం చెప్పారు. చిత్రం గొప్ప 'హిట్' అయింది. వారాల తరబడి టిక్కెట్లు దొరకకుండా పోయినవి. బ్లాక్ మార్కెట్లో టిక్కెట్లు అమ్మినవారే బాగా దోచుకున్నారు. అదే మొదటి అనుభవం కావటం వల్ల ప్రజలు దీనిని ఎట్లా ఆదరిస్తారో, చిత్రం ఎన్నాళ్ళు నడుస్తుందో అర్థంకాక ఆ ఎగ్జిబిటర్ ఎనిమిది వారాల అనంతరం ఒక సైలెంట్ చిత్రాన్ని బుక్ చేసుకున్నాడు మొదట్లోనే. ఈయన ముందుగానే కాంట్రాక్టు వ్రాసుకున్నందువల్ల ప్రజలు తండోప తండాలుగా వస్తున్నా, 'ఆలం ఆరా'ను ఎత్తి వేయాల్సి వచ్చింది.

'ఆలం ఆరా' విజయం నాకు నూతనోత్సాహాన్నిచ్చింది. టాకీలు భారత దేశంలో నిలబడగలవనే విశ్వాసం ఏర్పడింది. ఆటోమేటిక్ లేబరేటరీని ప్రప్రధమంగా స్థాపించింది కూడా నేనే. భారత దేశంలో మొట్టమొదటగా ఇంగ్లీషు చిత్రాన్ని తీసింది కూడా నేనే. అది నూర్జహాన్ చిత్రం. బర్మా, తమిళం, ఇరానీ భాషల్లో మొట్టమొదటగా చిత్రాలు నిర్మించింది నేనే. నా పెర్షియన్ చిత్రాలు 'దుల్‌తారా', 'లూర్', 'షిరిన్‌ఫరాద్', 'పరదేశి', ఇరాక్‌లో విజయవంతంగా నడిచాయి. ఆ తరువాత గుజరాతి, మరాఠి భాషల్లో చిత్రాలు తీశాను. భారతీయ టెక్నీషియన్లచే తయారు చేయబడిన నా వర్ణ చిత్రం 'కిసాన్‌కన్య' తర్వాత ఉద్భవించింది.

150 సైలెంటు చిత్రాలు, 100 టాకీలు తీసినా ఇంకా ఫిలిం పరిశ్రమలో ఉత్సాహం వుంది. ఇది అభివృద్ధి చెందటం ఎంతో ఆనందంగా వుంటుంది. నేను ఉత్సాహంగా పాల్గొనలేక పోయినా కూడా. ఫిలిం పరిశ్రమ వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ ఈ టాకీ రజతోత్సవ సందర్భాన నా శుభాకాంక్షలు తెలుపుచున్నాను.

Post your comments